

ఓటర్లకు డబ్బు చేరకనే ఓడిపోయా : ఎంటీబీ నాగరాజ్

బెంగళూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గత శాసనసభ ఎన్నికల్లో ఓటమికి పలు కారణాలు ఉన్నాయని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఎంటీబీ నాగరాజ్ తెలిపారు. హొస్కోటెలో ఆయన శుక్రవారం బీజేపీ కార్యకర్తలతో మాట్లాడుతూ ఓటర్ల కోసం కేటాయించిన డబ్బు సక్రమంగా పంపిణీ కాకపోవడంతోనే ఓడిపోవాల్సి వచ్చిందన్నారు. ఓటర్లకు సొమ్ము ఇచ్చేందుకు కొందరిని కేటాయించామని, వారు సక్రమంగా పంపిణీ చేయలేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు పడతామన్నారు. శాసనసభ ఎన్నికల్లో పార్టీ ముఖ్యుల స్వయంకృతాపరాధం కూడా తన ఓటమికి కారణమన్నారు.

రెండో విడత నామినేషన్లు ప్రారంభం



నామినేషన్ సమర్పిస్తున్న కలబురగి కాంగ్రెస్ అభ్యర్థి రాధాకృష్ణ దొడ్డమని

● 41 మంది అభ్యర్థులు.. 57 సెట్ల దాఖలు ● పాల్గొన్న ముఖ్యనాయకులు

బెంగళూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ రెండో విడతకు సంబంధించి తొలిరోజే నామినేషన్లు దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ కొనసాగాయి. రెండో విడత ఎన్నికలకు సంబంధించి చిక్కోడి, బెళగావి, బాగల్కోటె, విజయపుర, గుల్బర్గా, రాయచూరు, బీదర్, కొప్పళ, బళ్లారి, హావేరి, ధారవాడ, ఉత్తరకన్నడ, దావణగెరె, శివమొగ్గ స్థానాలు ఉన్నాయి. శుక్రవారం 57 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. బీదర్‌లో అంధుడైన స్వతంత్ర అభ్యర్థి దిలీప్ నాగప్ప భూసా నామినేషన్ సమర్పించారు. కలబురగిలో కాంగ్రెస్ అభ్యర్థి రాధాకృష్ణ దొడ్డమని నామినేషన్ సందర్భంగా కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్, మాజీ మంత్రి బాబూరావ్ చించన్‌సూర్, ఎమ్మెల్యే ఖనీజ్‌ఫాతిమా తదితరులు పాల్గొన్నారు. మొత్తం 41మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా వీరిలో 37మంది పురుషులు, నలుగురు మహిళలు ఉన్నారు. బీజేపీ తరఫున గుల్బర్గా నుంచి ఒకరు, కొప్పళ నుంచి ఇద్దరు, బళ్లారి, ఉత్తరకన్నడ నుంచి ముగ్గురు చొప్పున నామినేషన్లు వేశారు. కాంగ్రెస్ తరఫున బిజాపూర్ నుంచి ఒకరు, కలబురగి నుంచి ముగ్గురు, బళ్లారి నుంచి ముగ్గురు, దావణగెరె నుంచి ఇద్దరు నామినేషన్ వేశారు. ఆప్ నుంచి శివమొగ్గ స్థానానికి ఒకరు, బీఎస్పీ నుంచి విజయపుర, హావేరి నుంచి ఒక్కొక్కరు పోటీ చేయగా గుర్తింపు కల్గిన, గుర్తింపులేని పార్టీల నుంచి 20 మంది, స్వతంత్రులుగా 14 మంది నామినేషన్లు వేశారు. 57 సెట్ల నామినేషన్లలో బళ్లారి నుంచి 10, ఉత్తరకన్నడ, కొప్పళ నుంచి 7, దావణగెరె, శివమొగ్గ నుంచి 6 చొప్పున, గుల్బర్గా నుంచి 5, బిజాపూర్ నుంచి 4, చిక్కోడి, బాగల్కోటె నుంచి 3 చొప్పున, మిగిలిన నియోజకవర్గాల నుంచి ఒక్కో నామినేషన్ దాఖలయ్యాయి. తొలిరోజున 14 నియోజకవర్గాల నుంచి నామినేషన్లు దాఖలయ్యాయి.



బీదర్‌లో అంధుడైన స్వతంత్ర అభ్యర్థి దిలీప్ నాగప్ప భూసా నామినేషన్

ప్రధాని పర్యటనలో మార్పులు



● మంగళూరులో రోడ్‌షో కుదింపు ● మైసూరు సభకు భారీ ఏర్పాట్లు ● రేపు రాష్ట్రానికి ప్రధాని మోదీ

బెంగళూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాష్ట్ర ఎన్నికల ప్రచార కార్యక్రమం మరోసారి మార్పు జరిగింది. రాష్ట్రంలో తొలి విడత ఎన్నికల ప్రచారం, మరోవైపు రెండోవిడతకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్న తరుణంలోనే ప్రధానమంత్రి రోడ్‌షో, బహిరంగసభలు నిర్వహించదలిచారు. తొలుత బెంగళూరు ఉత్తర నియోజకవర్గ పరిధిలో రోడ్‌షో నిర్వహించాలనుకున్నారు. పలు కారణాలతో వాయిదా పడింది. మరోవైపు మండ్యలో రోడ్‌షో నిర్వహించాలనుకున్నా దాంట్లోనూ మార్పు చేశారు. 14న మధ్యాహ్నం రాష్ట్రానికి వచ్చే ప్రధాని నేరుగా మైసూరుకు ప్రత్యేక విమానంలో చేరుకుంటారు. అక్కడ మైసూరు, మండ్య, చామరాజనగర, హాసన్ బీజేపీ-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థుల కోసం ప్రచారం చేస్తారు. మైసూరు నగరంలోని మహారాజ కళాశాల మైదానం మధ్యాహ్నం 3 గంటలకు జరిగే బహిరంగసభలో ప్రధాని పాల్గొంటారు. ఇదే వేదికపై మాజీ ప్రధాని దేవెగౌడ భాగస్వామ్యులవుతారు. మండ్య ఎంపీ అభ్యర్థి కుమారస్వామి, మైసూరు అభ్యర్థి యదువీర్, చామరాజనగర అభ్యర్థి బాలరాజ్, హాసన్ అభ్యర్థి ప్రజ్వల్ రేవణ్ణ కోసం ప్రధాని ప్రచారం చేస్తారు. ప్రధానమంత్రి సభకు కనీసం 3-4లక్షల మందిని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మంగళూరులో రోడ్‌షో కుదింపు

మంగళూరులో ప్రధానమంత్రి రోడ్‌షోను కుదించారు. ఆదివారం సాయంత్రం మంగళూరు నగరంలో 2.9 కిలోమీటర్ల ప్రధాని రోడ్‌షో జరపాలని నిర్ణయించారు. నారాయణగురు సర్కిల్ నుంచి హంపనకట్టె వరకు రోడ్‌షో జరిపేందుకు తీర్మానించారు. రాష్ట్ర పోలీసులు, బీజేపీ నేతలు అందుకు సానుకూలం తెలిపారు. ఎస్పీజీ బలగాలు శుక్రవారం రోడ్‌షో ప్రాంతాన్ని పరిశీలించారు. ఎస్పీజీ అధికారుల బృందం రోడ్డు పొడవునా నడక సాగించి పరిశీలించారు. రోడ్‌షోకు సమంజసం కాదని అభ్యంతరం తెలిపారు. ప్రస్తుతం షెడ్యూల్ ప్రకారం ఉండే 2.9 కిలోమీటర్లకు బదులుగా 1.8 కిలోమీటర్లకు కుదించారు. సుమారు 1500 మంది అదనంగా పోలీసులను భద్రతకు కేటాయించదలిచారు. 1.8 కిలోమీటర్ల మేర సాగే ప్రధాని రోడ్‌షో నారాయణగురు సర్కిల్ నుంచి ప్రారంభమవుతుంది. అక్కడ నారాయణగురు విగ్రహానికి పూలమాల సమర్పిస్తారు. అక్కడి నుంచి మంగళూరు కార్పొరేషన్ కార్యాలయం, భళ్లాల భాగ్, పీవీఎస్ సర్కిల్ దాకా రోడ్‌షో ముగుస్తుంది. ప్రధాని రోడ్‌షో అరగంటలోపే ముగిసే అవకాశం ఉంది. ఆ తర్వాత మార్పులు ఉండకపోవచ్చునని రాష్ట్ర పార్టీ నాయకులు తెలిపారు.

శివమొగ్గలో రెబెల్‌గా ఈశ్వరప్ప

● భారీ ర్యాలీతో నామినేషన్ దాఖలు

బెంగళూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నేత, మాజీ ఉపముఖ్యమంత్రి కేఎస్ ఈశ్వరప్ప శివమొగ్గ లోక్‌సభ స్థానానికి రెబెల్‌గా శుక్రవారం అభిమానులతో కలసి భారీ ర్యాలీగా వచ్చి నామినేషన్ వేశారు. కుమారుడు కాంతేశ్‌కు హావేరి టిక్కెట్ కోసం ప్రయత్నించారు. దక్కకపోవడానికి పార్టీ నేత యడియూరప్ప కారకుడని ఆగ్రహం వ్యక్తం చేశారు. యడియూరప్ప కుమారుడు రాఘవేంద్ర బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సొంత జిల్లా శివమొగ్గ నుంచి ఈశ్వరప్ప నామినేషన్ వేశారు. బలప్రదర్శన కోసం భారీగా జనాన్ని తరలించారు. నామినేషన్‌కు ముందు ఈశ్వరప్ప మీడియాతో మాట్లాడుతూ శివమొగ్గ నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్నా అన్నారు. పెద్దసంఖ్యలో అభిమానులు, ఓటర్లు తరలిరావడం సంతోషంగా ఉందన్నారు. కులమతాలకు అతీతంగా మద్దతు ఇవ్వడం చూస్తే గెలుపు తనదే అనిపిస్తోందన్నారు. కోటె ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి అక్కడి నుంచి కోటె మారికాంబ ఆలయంలో మొక్కులు తీర్చుకుని ర్యాలీగా వచ్చి నామినేషన్ వేశారు. ఈశ్వరప్ప నామినేషన్‌తో బీజేపీ నేతల్లో గుబులు పట్టుకుంది. నామినేషన్ల ప్రక్రియకు ముందే రాజీ కుదర్చాలని భావించారు. స్వయంగా అమిత్‌షా ఫోన్ చేసి నామినేషన్ వద్దంటూ సూచించారు. ఆయన ఆహ్వానం మేరకు ఢిల్లీకి వెళ్లగా అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడంతో పరోక్షంగా తనకు ఆశీస్సులు అందించారని, పోటీ చేయాలనేందుకు ఇదే సంకేతమని ఈశ్వరప్ప చెప్పుకున్నారు. యడియూరప్పకు ఇద్దరు కుమారులు కాగా పెద్ద కుమారుడు రాఘవేంద్ర శివమొగ్గ ఎంపీగా వ్యవహరిస్తున్నారు. మరోసారి అతడికి టిక్కెట్ ఇచ్చారు. మరో కుమారుడు విజయేంద్ర శికారిపుర ఎమ్మెల్యేగా వ్యవహరిస్తూనే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. రాష్ట్రంలో బీజేపీ అభివృద్ధికి పాటుపడినవారిలో యడియూరప్పతో సమాన నాయకుడినని, ప్రతి విషయంలో అన్యాయం చేస్తే సహించలేనని అన్నారు. యడియూరప్ప సొంత పార్టీ పెట్టి మరోసారి బీజేపీలోకి వచ్చారని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కుటుంబ రాజకీయాలకు స్వస్తి చెప్పాలని ప్రయత్నిస్తుంటే యడియూరప్ప మాత్రం ఇంటిల్లిపాదికీ పదవులు కట్టబెట్టుకున్నారని తెలిపారు. కుటుంబ పాలనకు శివమొగ్గ నుంచే స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు.



శివమొగ్గ స్వతంత్ర అభ్యర్థిగా కేఎస్ ఈశ్వరప్ప నామినేషన్

పోలీసు జీపును ఢీకొన్న తమిళనాడు ప్రభుత్వ బస్సు

● కర్ణాటక పోలీసు అధికారి సహా ముగ్గురి మృతి

పెరంబూర్, ఏప్రిల్ 12: తమిళనాడు రాష్ట్రం కీళపెన్నాత్తూర్ సమీపంలో పోలీసు జీపును ప్రభుత్వ బస్సు ఢీకొన్న ఘటనలో కర్ణాటక పోలీసు అధికారి సహా ముగ్గురు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. కర్ణాటక రాష్ట్ర ప్రత్యేక పోలీసు విభాగ డిప్యూటీ కమాండెంట్ ప్రభాకర(50), ప్రత్యేక పోలీసు విభాగ అధికారి హేమంత్(42), కానిస్టేబుల్ విఠల్ (35) సేలం జిల్లాలో లోక్‌సభ ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రత్యేక పోలీసు విభాగానికి చెందిన దినేష్, జయకుమార్ కూడా సేలంలో పని చేస్తున్నారు. వీరు ఐదుగురు గురువారం సేలం నుంచి కాంచీపురానికి పోలీసు వాహనంలో వచ్చారు. అక్కడి ఆలయంలో దర్శనం చేసుకొని మళ్లీ సేలంకు తిరుగు ప్రయాణమయ్యారు. కీళపెన్నాత్తూర్ బైపాస్ రోడ్డు, ఎంజీఆర్ నగర్ జంక్షన్‌లో వస్తుండగా తిరువణ్ణామలై నుంచి చెన్నై వెళ్తున్న ప్రభుత్వ బస్సు అదుపుతప్పి పోలీసు వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో జీపు నుజ్జునుజ్జుకాగా, కమాండెంట్ ప్రభాకర, దినేష్ తీవ్రగాయాలతో సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. గాయపడిన హేమంత్, జయకుమార్, విఠల్‌ను స్థానికులు రక్షించి తిరువణ్ణామలై ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో విఠల్ మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని తిరువణ్ణామలై ఎస్పీ కె.కార్తికేయన్ పరిశీలించారు. ఘటనపై కీళపెన్నాత్తూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



నుజ్జునుజ్జయిన పోలీసు జీపు

35 కళాశాలల్లో సున్నా ఫలితాలు



● 26 ప్రైవేట్ కళాశాలల్లోనూ అదే పరిస్థితి ● బోధన సిబ్బందిపై దృష్టి సారించని ప్రభుత్వాలు, పాలక కమిటీలు

బెంగళూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ద్వితీయ పీయూ ఫలితాలు వెలువడ్డాక రాష్ట్రమంతటా విద్యార్థులలో వృత్తి విద్యాకోర్సులు, డిగ్రీలో చేరే సంబరంలో ఉన్నారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా ఏకంగా 35 కళాశాలల్లో జీరో ఫలితాలు నమోదయ్యాయి. వీటిలో 26 ప్రైవేట్ కళాశాలలు ఉండడం గమనార్హం. జీరో ఫలితాలు నమోదైన ప్రైవేట్ కళాశాలల్లో.. వినాయక పీయూ మహిళా కళాశాల - సుంకదకట్టె, పవన్ పీయూ కాలేజ్ - శ్రీరాంపుర, బసవరాజ్‌స్వామి పీయూ కళాశాల - లవకుశనగర, లగ్గెరె, మొహర పీయూ కళాశాల - బాబుసాబ్‌పాళ్య, బెంగళూరు, వినాయక సరస్వతి పీయూ కళాశాల - హొస్పేట, బసవ పీయూ కళాశాల - ఇండి తాలూకా, విజయపుర, దయానంద పీయూ కళాశాల - విజయపుర, విజయ పీయూ కళాశాల - గదగ్, ఎస్‌కేఆర్ స్వామి కంప్యూటర్ సైన్స్ కళాశాల - చిత్రదుర్గ, నూసాగర్ పీయూ కళాశాల - విజయపుర, ఎస్వీ పీయూ కళాశాల- బీదర్, శారదా పీయూ కళాశాల - బీదర్, జాస్మిన్ పీయూ కళాశాల - బీదర్, హెచ్ఎస్‌బీ పీయూ కళాశాల - హావేరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పీయూ కళాశాల - హావేరి, మల్లికా పీయూ కళాశాల - యాదగిరి, నీలకంఠ పీయూ కళాశాల - యాదగిరి, జెంట్స్ కామర్స్ పీయూ కళాశాల - ధారవాడ, టీఈఎస్ ఖాదర్ పటేల్ పీయూ కళాశాల - కలబురగి, హెచ్‌కే గరీబ్‌నవాజ్ పీయూ కళాశాల - కలబురగి, ఎస్‌టీఎంఈఎస్ గర్ల్స్ పీయూ కళాశాల - యాదగిరి, సాగరనాడు పీయూ కాలేజ్ - యాదగిరి, ఆదిత్య పీయూ కళాశాల - రాయచూరు, కేఆర్‌సీ గర్ల్స్ రూరల్ పీయూ కళాశాల - కొప్పళ, బ్రహ్మారంభ ఉమెన్ పీయూ కళాశాల - కొప్పళ, షిర్డీసాయి పీయూ కళాశాల - ఉడుపి. ప్రభుత్వ కళాశాలల్లో దావణగెరె ప్రభుత్వ పీయూ కాలేజ్, ధారవాడ పీయూ కళాశాల. ఇక ఎయిడెడ్ కళాశాలల్లో సిద్ధగంగా పీయూ కళాశాల - బెంగళూరు, పబ్లిక్ కంప్యూటర్ సైన్స్ పీయూ కళాశాల - రామనగర, కేఎల్‌ఈఎస్ ఐఎన్‌డీపీ కళాశాల - బీదర్, జీవీపీ మెమ్ కంప్యూటర్ సైన్స్ కళాశాల - చిత్రదుర్గ, మెథోడిస్ట్ గర్ల్స్ పీయూ కళాశాల - కోలారు, సెంట్రల్ కంప్యూటర్ సైన్స్ పీయూ కళాశాల - తుమకూరు, డాక్టర్ అంబేడ్కర్ పీయూ కళాశాల - ఇందిరానగర్, బెంగళూరు ఉన్నాయి. ఉత్తరకర్ణాటక పరిధిలోని బీదర్ జిల్లా పరిధిలో మూడు, యాదగిరి పరిధిలో నాలుగు, కలబురగి పరిధిలో రెండు, కొప్పళలో రెండు, విజయపురలో మూడు కళాశాలలు ఉండగా బెంగళూరులో ఐదు కళాశాలలు జీరో ఫలితాలు నమోదయ్యాయి.



జీరో ఫలితాల కళాశాలలు మూసివేయాలి

రాష్ట్రంలో ఏకంగా 35 కళాశాలల్లో జీరో ఫలితాలు నమోదయ్యాయని, వాటిని మూసివేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. ఏకంగా 32 కళాశాలల్లో ప్రైవేట్, ఎయిడెడ్ ఉన్నాయని వాటిపట్ల పాలకవర్గాల నిర్లక్ష్యమే కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత ఏడాది 78 పీయూ కళాశాలల్లో సున్నా ఫలితాలు నమోదయ్యాయని, గతంలో కంటే మెరుగు అనిపించినా ఏకంగా కళాశాలకు ఒక్కరు కూడా ఉత్తీర్ణులు కాలేదంటే వారి వద్ద మౌలిక సదుపాయాలు, అధ్యాపకుల కొరత ఉన్నట్టేనని తెలుస్తోంది. జీరో ఫలితాల కళాశాలలను మూసివేయాలని, విద్యార్థులను చేర్చుకుని బోధనలు కొనసాగించకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జీరో ఫలితాల కళాశాలల్లో వచ్చే విద్యాసంవత్సరం అడ్మిషన్లు జరగకుండా అడ్డుకోవాల్సిన అవసరం ఉంది. విద్యాశాఖ అధికారులు తెలిపిన మేరకు వరుసగా మూడేళ్ల జీరో ఫలితాలు నమోదైతే అటువంటి కళాశాలల గుర్తింపు రద్దు చేసే నిబంధనలు ఉన్నాయి. ఇటువంటి కళాశాలలతో విద్యార్థుల భవిష్యత్తుకు ముప్పు అనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వ్యక్తిగత విమర్శలు ఆపండి.. లేదంటే మీ బండారం బయటపెడతా

● కూడలసంగమ మఠాధిపతిపై మాజీ మంత్రి నిరాణి ఆగ్రహం




బెంగళూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత విమర్శలు ఆపాలని.. లేదంటే మీ రహస్యాలను బహిర్గతం చేస్తానని కూడలసంగమ పంచమశాలి పీఠాధిపతి బసవమృత్యుంజయస్వామిజీపై మాజీ మంత్రి మురుగేశ్ నిరాణి మండిపడ్డారు. వ్యక్తిగత అంశాలకు వస్తే మీ అసలు రహస్యాలను తాము చెప్పాల్సి ఉంటుందన్నారు. బాగల్కోటె జిల్లా కలాదగిలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తనపై వ్యక్తిగత దాడిని కొనసాగిస్తే సహించేది లేదన్నారు. ఆయనకు సంబంధించిన వందలాది విషయాలు తన వద్ద ఉన్నాయన్నారు. గౌరవంతో మౌనంగా ఉన్నానని, అది చేతగానితనం అనుకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి మృణాల్, జగదీశ్‌శెట్టర్ ఒకే సామాజికవర్గానికి చెందినవారని మీరెందుకు ప్రచారం చేస్తున్నారని ప్రశ్నించారు. పంచమశాలి వర్గానికి చెందినవారికి మాత్రమే ప్రచారం చేయాలని, అబద్ధాలు సరికాదన్నారు. బీజేపీ ప్రభుత్వం ఉన్నప్పుడు 2డీ రిజర్వేషన్ కల్పించామని, అప్పుడు కాంగ్రెస్ ఏజెంటులా వ్యవహరించారన్నారు. లక్ష్మీ హెబ్బాళ్కర్ తాము అధికారంలోకి వస్తే 2ఏ రిజర్వేషన్‌ను మూడు నెలల్లో అమలు చేస్తామని చెప్పారన్నారు. ఆమె మంత్రిగా బాధ్యతలు చేపట్టి 11 నెలలు అవుతోందని, సాధ్యం చేశారా.. అని ప్రశ్నించారు. బెళగావికి శెట్టర్ వలస నేత అయితే లక్ష్మీ హెబ్బాళ్కర్ కూడా ఖానాపూర్‌కు చెందినవారన్నారు. సిద్ధరామయ్య బాదామిలో పోటీ చేయలేదా..? ఇందిరాగాంధీ, సోనియాగాంధీ కర్ణాటక నుంచి ఎందుకు పోటీ చేశారని ప్రశ్నించారు.

రూ.30లక్షల విలువైన మొబైల్ ఫోన్లు స్వాధీనం

బెంగళూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరంలోని వైట్‌ఫీల్డ్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో రూ.30 లక్షల విలువైన 107 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు నగర పోలీస్ కమిషనర్ దయానంద్ వెల్లడించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏప్రిల్ 5న బాధితుడి ఫిర్యాదు మేరకు ఆరుగురిని అదుపులోకి తీసుకోగా మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా పది రోజుల పోలీస్ కస్టడీకి తీసుకున్నామన్నారు. కాడుగూడి పోలీస్ స్టేషన్ పరిధిలోని చెన్నసంద్రలోని ఒక బాడుగ ఇంట్లో ఉండేవారుగా గుర్తించామన్నారు. గదిని సోదా చేయగా వివిధ కంపెనీలకు చెందిన మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. మొత్తం 107 మొబైల్ ఫోన్ల విలువ సుమారు రూ.30లక్షలుగా ఉంటుందన్నారు. ఇందులో పాల్గొన్న పోలీసులను ఆయన అభినందించారు.



మొబైల్ ఫోన్లు చూపుతున్న నగర పోలీస్ కమిషనర్ దయానంద్



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,579.02	1,577.32
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	172	278
సామర్థ్యం (టీఎంసీలు)	4.01	3.31

కోలాహలంగా కమలం, కాంగ్రెస్ నామినేషన్లు

● బీజేపీ అభ్యర్థిగా బి. శ్రీరాములు, కాంగ్రెస్ అభ్యర్థిగా ఈ.తుకారామ్ ● ఎస్‌యూసీఐ నుంచి దేవదాస్, ఇండిపెండెంట్‌గా భాగ్యలక్ష్మి



మంత్రులు బి. నాగేంద్ర, ఎంబీ పాటిల్, జమీర్ అహ్మద్, అల్లం వీరభద్రప్పల మద్దతుతో నామినేషన్ సమర్పిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి ఈ. తుకారామ్



గాలి లక్ష్మిఅరుణ, ఇతర బీజేపీ నాయకులతో కలిసి నామినేషన్ దాఖలుచేస్తున్న బీజేపీ అభ్యర్థి బి. శ్రీరాములు

బళ్లారి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ అభ్యర్థుల నామినేషన్ల కార్యక్రమం శుక్రవారం కోలాహలంగా సాగింది. భారతీయ జనతా పార్టీ నుంచి బి. శ్రీరాములు, కాంగ్రెస్ పార్టీ నుండి తుకారాం నామినేషన్లు దాఖలు చేశారు. ఎస్‌యూసీఐ(కమ్యూనిస్టు)పార్టీ నుండి దేవదాస్, ఇండిపెండెంట్ అభ్యర్థిగా భాగ్యలక్ష్మి నామినేషన్లు సమర్పించారు. ప్రధాన రాజకీయ పార్టీలు అయిన కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు కోలాహలంగా నామినేషన్లు వేయగా, ఎస్‌యూసీఐ పార్టీ నాయకులు ఎటువంటి హడావిడీ లేకుండా నామినేషన్లు వేశారు.



నామినేషన్ వేస్తున్న ఎస్‌యూసీఐ అభ్యర్థి దేవదాస్

కాంగ్రెస్ పార్టీ నుంచి ఈ.తుకారాం ముందుగా మంచి ముహూర్తం ఉందని వచ్చి ఒక సెట్ నామినేషన్ వేశారు. తరువాత కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రి బి. నాగేంద్ర, జమీర్ అహ్మద్, ఎంబీ పాటిల్, ఎమ్మెల్యే భరత్‌రెడ్డి, గణేష్, నాగరాజు, డి.సీ.సీ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్, ఏఐసీసీ కార్యవర్గ సభ్యుడు అల్లం వీరభద్రప్పలతో కలిసి వచ్చి మరో సెట్ నామినేషన్లు దాఖలు చేశారు. బీజేపీ అభ్యర్థి బి. శ్రీరాములు మూడు సెట్ల నామినేషన్లు సమర్పించారు. కాంగ్రెస్ అభ్యర్థి ఈ. తుకారామ్ ముందుగా నామినేషన్ వేయగా, మధ్యాహ్నం రెండు గంటల తరువాత బి. శ్రీరాములు నామినేషన్ దాఖలు చేయడం విశేషం.

కాంగ్రెస్ పార్టీ నాయకులు బళ్లారి దుర్గమ్మ దేవి ఆలయంలో పూజలు చేసి అక్కడ నుండి ర్యాలీగా వచ్చారు. బీజేపీ అభ్యర్థి బి. శ్రీరాములు కూడా దుర్గమ్మదేవి ఆలయంలో పూజలు చేసి అక్కడ నుండి భారీ ఊరేగింపుగా డి.సీ కార్యాలయం వద్దకు చేరుకుని నామినేషన్లు దాఖలు చేశారు. బీజేపీ అభ్యర్థి నామినేషన్ల కార్యక్రమంలో మాజీ మంత్రి ఆనంద్‌సింగ్, మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు, మాజీ ఎంపీ పక్కీరప్ప, గాలి జనార్దన్‌రెడ్డి సతీమణి గాలి లక్ష్మిఅరుణ, మాజీ బుడా అధ్యక్షుడు పాలన్న, తిమ్మప్ప, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అనిల్ నాయుడు, వివిద ప్రాంతాల నుంచి వచ్చిన బీజేపీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమంలో ఆ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తల సంబరాలు

బళ్లారిరూరల్, ఏప్రిల్ 12 : బళ్లారి నగరంలో బీజేపీ, జేడీఎస్ కూటమి ఆధ్వర్యంలో లోక్‌సభ స్థానానికి శ్రీరాములు నామినేషన్ దాఖలు చేయగా, కాంగ్రెస్ పార్టీ నుంచి ఈ తుకారామ్ కూడా శుక్రవారమే నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా సందడి నెలకొంది. కలెక్టర్ కార్యాలయం నుంచి వంద మీటర్ల వరకు 144 సెక్షన్ విధిస్తూ నామినేషన్ల సందర్భంగా బళ్లారి డీఎస్పీ నందరెడ్డి, సీఐలు సింధూర్, ధర్మకర్ ఎస్ ధర్మట్టి, సతీష్ రుద్రప్ప, ట్రాఫిక్ సీఐ అయ్యన్నగౌడ పాటిల్, పోలీసులు నగరంలో డీసీ కార్యాలయం వద్ద పలు ప్రాంతాల్లో భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీ కార్యాలయం సమీపంలో పోలీసు ఉన్నతాధికారులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం ఇరుపార్టీల అభ్యర్థులు బళ్లారి కనకదుర్గమ్మ ఆలయంలో ముందుగా పూజలు చేసుకుని అక్కడి నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు నాయకులు, కార్యకర్తలతో భారీ ఊరేగింపుగా వెళ్లి నామినేషన్లు దాఖలు చేశారు.



ర్యాలీగా వస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

బళ్లారిని సోనియాకు బహుమతిగా ఇస్తాం



మాట్లాడుతున్న మంత్రులు నాగేంద్ర, ఎంబీ పాటిల్

బళ్లారి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పంచ పథకాలు ప్రజలకు చాలా ఉపయోగ కరంగా ఉన్నాయని, ప్రజలు ఓటింగ్ రోజు ఖచ్చితంగా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపిస్తారని రాష్ట్ర మంత్రి నాగేంద్ర విశ్వాసం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ తరుపున తుకారామ్ శుక్రవారం డి.సీ కార్యాలయంలో నామినేషన్ వేసిన తరువాత అక్కడ మీడియా పాయింట్‌లో రాష్ట్ర మంత్రి ఎంబీ పాటిల్, కాంగ్రెస్ అభ్యర్థి ఈ.తుకారామ్, విజయనగర ఎమ్మెల్యే గవియప్ప, ఇతర ఎమ్మెల్యేలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. బళ్లారి అంటే కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ పోటీ చేసి గెలిచిన గడ్డఅని, ఈసారి కూడా కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా ఈ.తుకారం విజయం సాధిస్తారన్నారు. ఫలితాల తర్వాత బళ్లారిని సోనియమ్మకు బహుమతిగా ఇస్తామన్నారు. ప్రతి పేదవాడికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందుతున్నాయన్నారు. అలాగే ఈసారి నూటికి నూరు శాతం రాహుల్ గాంధీ ప్రధాని మంత్రి అవుతారని జోస్యం చెప్పారు. శ్రీరాములు ఇక రాజకీయ సన్యాసం తీసుకుంటారన్నారు.

బీజేపీకే ప్రజల ఆదరణ



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర

- రాష్ట్రంలో 28 సీట్లలో మాదే విజయం
- ఈశ్వరప్ప కూడా మాతోనే
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర

బళ్లారి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో బీజేపీకి ఎటువంటి ఢోకా లేదు. 28 కి 28 సీట్లు గెలుస్తాము. తిరిగి పీఎంగా నరేంద్ర మోదీ ఎన్నికవుతారు' అని కర్ణాటక బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర పేర్కొన్నారు. ఆయన శుక్రవారం బళ్లారిలో వీరశైవ విద్యావర్ధక సంఘం నాయకులతో మాట్లాడారు. అలాగే అల్లం వీరభద్రప్ప భవన్‌లో బీజేపీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, బీజేపీ అధికారంలోకి వస్తుందని అలాగే కర్నాటక నుంచి 28 స్థానాలు గెలుస్తామని చెప్పారు. బీజేపీకి చెందిన మాజీ మంత్రి ఈశ్వరప్ప తనకు ఎంపీ టికెట్ దక్కలేదనే కోపంతో ఉన్నారు కదా? అని ప్రశ్నించగా ఈశ్వరప్ప విషయం పార్టీలో సర్దుబాటవు తుందన్నారు. అలాగే సిద్దరామయ్య కాంగ్రెస్ లీడర్ అయితే, విజయేంద్ర బీజేపీ రాష్ట్ర లీడర్ అని ప్రచారం సాగుతోందని, దీనిపై ఏమంటారని ప్రశ్నించగా, ఆయన తేలిగ్గా తీసుకుని ఎవరి ప్రాధాన్యత వారికి ఉంటుందన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ గెలువడం మాత్రం ఖాయమన్నారు.



ర్యాలీగా వస్తున్న బీజేపీ నేతలు

కొప్పళ కాంగ్రెస్ అభ్యర్థి రాజశేఖర్ ఇట్నాల్ నామినేషన్



నామినేషన్ సమర్పిస్తున్న రాజశేఖర్ ఇట్నాల్

గంగావతి రూరల్, ఏప్రిల్ 12: కొప్పళ లోక్‌సభ అభ్యర్థి రాజశేఖర్ ఇట్నాల్ కొప్పళ డీసీ కార్యాలయంలో లాంఛనంగా నామినేషన్ వేశారు. ఈసందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ 16వ తేదిన 8 తాలూకాల కార్యకర్తలు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, కార్యకర్తలతో నామినేషన్ వేస్తామన్నారు. ఈసారి అత్యధిక మెజారిటీతో గెలుపు సాధిస్తామని ధీమా వ్యక్తపరిచారు.

తాలుకా టాపర్‌గా నిలిచిన గంగమ్మ



సిరుగుప్ప, ఏప్రిల్ 12: పీయుసీ పరీక్షలలో కామర్స్ విభాగంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని గంగమ్మ 579 మార్కులు దక్కించుకుని టాపర్‌గా నిలిచింది. సిరుగుప్ప తాలుకాలో అచ్చొళ్లి పరిధిలో కామర్స్ విభాగంలో తాలుకాలోనే టాపర్‌గా నిలవడంతో కళాశాల ప్రిన్సిపాల్ మహేష్, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. తాలుకా ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ ఆమెను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కంప్లి, ఏప్రిల్ 12 : కుడితిని పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత దరోజీ, దర్గా మలుపు వద్ద రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. అక్కడున్న స్థానికులు వెంటనే పోలీసులకు తెలుపగా వెంటనే ఎస్ఐ ఉలిగేష్, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. దేవలాపురం గ్రామానికి చెందిన దుర్గేష్ (30) కుడితిని నుంచి దేవలాపురం గ్రామానికి వెళుతుండగా పక్కనే వున్న స్తంభానికి ఢీకొని బలమైన గాయాలు కావడంతో అక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతి చెందిన దుర్గేష్‌ను బళ్లారి విమ్స్ ఆస్పత్రికి పోస్టుమార్టమ్ నిమిత్తం తరలించి, దీనిపై కుడితిని పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రాయచూరులో తొలిరోజు ఒకే ఒక్క నామినేషన్

రాయచూరు, ఏప్రిల్ 12 : తొలిరోజు రాయచూరు లోకసభ స్థానానికి భారతీయ జనసామ్రాట్‌పార్టీ అభ్యర్థిగా శామ్‌రావ్‌మేదార్ తన నామినేషన్ పత్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి చంద్రశేఖర్ నాయక్‌కు అందజేశారు. నామినేషన్‌ల పర్వం మొదలైన నేపథ్యంలో జిల్లాధికారి కార్యాలయం వద్ద భారీ పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశారు. నేటి నుంచి ప్రారంభమైన నామినేషన్‌ల ప్రక్రియ ప్రభుత్వం సెలవు దినాలను మినహాయించి ఈ నెల 19వ తేదీ వరకు ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉంటుందని జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థితో పాటు మరో ఐదుగురికి మాత్రమే లోపలికి అనుమతి ఉంటుందన్నారు. వాహనాలకు సంబంధించి జిల్లాధికారి కార్యాలయం ప్రధాన గేట్ నుంచి ఒక్కో అభ్యర్థికి మూడు వాహనాలకు మించి అనుమతి ఉండదన్నారు. నామినేషన్ దాఖలుచేసే అభ్యర్థులతో పాటు పార్టీలు, అభ్యర్థుల మద్దతుదారులు తప్పని సరిగా కోడ్‌ను పాటించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ నెల 20వ తేదీ ఉదయం 11 గంటలకు నామినేషన్‌ల ప్రక్రియ పరిశీలన ఉంటుందని 23వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్‌ల ఉపసంహరణ ఉంటుందని వివరించారు.



నామినేషన్ పత్రం అందజేస్తున్న శామ్‌రావ్ మేదార్

పీయూసీ ఫలితాల్లో నారాయణ ప్రభంజనం



హైదరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం ప్రీ యూనివర్సిటి సర్టిఫికేట్ (పీయూసీ) ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు అపూర్వ ప్రతిభ కనబరిచారు. 2023-2024 పీయూసీ ఫలితాల్లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, బయోలాజి (పీజీఎంబీ) విభాగంలో నారాయణ విద్యార్థి వజ్రకాంత్ షైరాగి 600 మార్కులకు గాను 592 మార్కులు సాధించి టాప్ స్కోరర్‌గా నిలిచినట్లు నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ తెలిపారు. అంతే కాకుండా తమ విద్యార్థులు 200 మంది 570 మార్కుల కంటే ఎక్కువగా సాధించినట్లు పేర్కొన్నారు. 1000 మందికి పైగా నారాయణ విద్యార్థుల 540 మార్కుల కంటే ఎక్కువగా సాధించినట్లు తెలిపారు. 45 శాతం విద్యార్థులు ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు. మొత్తంగా పీయూసీ ఫలితాల్లో నారాయణ పీయూ కాలేజీలు 99 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు. విద్యార్థులను, అధ్యాపకులను నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు అభినందించారు.

ద్వితీయ పియూసీలో శ్రీ మేధా కాలేజీ విద్యార్థుల ప్రతిభ



ధృవ్ కన్‌కాని టస్కీనా తహసీన్ హర్షితా డింకిజైన్ మిన్‌సా మారియా శైలేష్

బళ్లారి సిటీ, ఏప్రిల్ 12: ద్వితీయ పియూసీ పరీక్షా ఫలితాల్లో శ్రీ మేధా కాలేజీ వాణిజ్య విభాగంలో ధృవ్ కన్‌కాని 583/600,టస్కీనా తహసీన్ 580మార్కులు, హర్షితా 579, డింకి జైన్ 566, మిన్‌సా మారియా కురియ్‌కోసి 560, శైలేష్ 558 మార్కులను సాధించారు. ఈకాలేజీలో మొత్తం 23మంది విద్యార్థులు డిస్టింక్షన్‌లో, 50మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులు కాగా, అనేక మంది విద్యార్థులు వివిధ సబ్జెక్టులలో వందకు వంద మార్కులను తీసుకొచ్చి కళాశాలకు కీర్తితీసుకొచ్చారని కళాశాల పాలక మండలి తరపున రామ్‌కిరణ్, ప్రిన్సిపాల్ విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. మొత్తం 94శాతం ఉత్తీర్ణత సాధించిందన్నారు. కళాశాలకు కీర్తిని తెచ్చిన విద్యార్థులను వారు అభినందించారు.

సర్ ఎంవీ సమూహ శిక్షణ సంస్థకు ఉత్తమ ఫలితాలు



అనన్య ఆకాశ్ అమృతదొడ్డబసప్పనవర్ మహ్మద్ సుహైల్ బృందా సంజనా దుష్యంత్
నవాజ్ ప్రియాంక రక్షితా శివాని రవితేజ భూమిక కృతి

బళ్లారి సిటీ, ఏప్రిల్ 12: దావణగేరి నగరం సర్, ఎం.వి సమూహ శిక్షణ సంస్థ విద్యార్థులు 2024 సంవత్సరంలో ద్వితీయ పీయూసీలో సైన్స్ విభాగంలో ప్రథమ స్థానం, వాణిజ్య విభాగంలో జిల్లాకు అత్యుత్తమ స్థానాన్ని సాధించారు. ఈఫలితాల్లో సర్.ఎం.వి, శిక్షణ సంస్థకు చెందిన నలుగురు విద్యార్థులు 600 మార్కులకు గాను 593 మార్కులతో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారు. అనన్య 593/600, ఆకాశ్ 593, అమృత దొడ్డబసప్పనవర్ 593, మహమ్మద్ సుహైల్ 593, బృందా 592, సంజనా 592, దుష్యంత్ 592, నవాజ్ 592, ప్రియాంక 592, రక్షితా 592, శివాని 591, రవితేజ నాగొళ్ళి 590, భూమిక 590, కొండప్రజ్వల్ 590, కృతి 590 మార్కులను సాధించారు. అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులను కళాశాల కార్యదర్శి శ్రీదర్, ప్రిన్సిపాల్ తదితరులు అభినందించారు.

గొల్లరహట్టిలో వాంతులు, విరేచనాలు

కంప్లి, ఏప్రిల్ 12 : విజయనగర జిల్లా కూడ్లిగి తాలుకా గొల్లరహట్టి గ్రామంలో వాంతులు, విరేచనాలతో సుమారు 20 మంది అస్వస్థతకు గురయ్యారు. వెంటనే విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ అక్కడకు చేరుకుని డాక్టర్లతో సంప్రదించి వెంటనే వారికి మెరుగైన చికిత్స చేయాలని తెలిపారు. గ్రామంలో అపరిశుభ్రత, తాగునీటి కాలుష్యంపై దృష్టి సారించాలని సూచించాలని తెలిపారు. గ్రామంలో ప్రతి ఇంటా చికిత్స చేయాలని సూచించారు.

హోసూరు జోన్

మళ్ళీ మోదీకి మద్దతు ఇవ్వాలి



సమావేశంలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు సన్మానం చేస్తున్న దృశ్యం

హోసూరు, ఏప్రిల్ 12: నరేంద్రమోదీ మళ్ళీ ప్రధాని అయ్యేలా ప్రజలు మద్దతు ఇవ్వాలని కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ పిలుపునిచ్చారు. హోసూరు బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ ప్రస్తుత ఎన్నికల్లో డీఎంకేను ఓడించాలన్నారు. బీజేపీ అభ్యర్థి నరసింహన్‌కు మద్దతుగా హోసూరు రాంనగర్ అన్నా విగ్రహం దగ్గర శుక్రవారం ఉదయం ప్రచార సభ జరిగింది. ఈ సందర్భంగా తమిళ నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ప్రధానమంత్రి ముద్రా యోజన పథకం చిన్న వ్యాపారాలకు ఎలాంటి హామీ లేకుండా బ్యాంకుల నుంచి తక్కువ వడ్డీకి రుణం పొందే పథకంతో దేశవ్యాప్తంగా ఎంతోమంది ప్రయోజనం పొందారన్నారు. కృష్ణగిరి జిల్లాకే రూ.5.427 కోట్లు కేటాయించబడినట్టు తెలిపారు. వృద్ధాప్య పింఛన్ పథకం, ప్రతి ఇంటికి తాగునీటి కనెక్షన్ ఇచ్చే పథకం, పేదలకు ఇళ్ళు నిర్మించే పథకం, కిసాన్ సమ్మాన్ ద్వారా రైతులకు ఏడాదికి రూ.6వేలు తదితర పథకాలను ప్రస్తావించారు. జిల్లాలో 64 వేల మంది ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ పథకం కార్డులతో మెరుగైన వైద్యం పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో బాలకృష్ణన్, మునిరాజ్, న్యాయవాది కదిరవన్, జిల్లా కార్యదర్శి మారేగౌడు, మిత్రపక్షాల సభ్యులు పాల్గొన్నారు. అంతకుముందు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఢిల్లీ నుంచి విమానంలో బెంగళూరు చేరుకుని అక్కడి నుంచి హోసూరుకు చేరుకున్నారు.

సమానత్వంపై ప్రత్యేక జాగృతి

హోసూరు (కృష్ణగిరి), ఏప్రిల్ 12: కృష్ణగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని సమానతా దినోత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ సరయు అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. కుల విభేదాలకు వ్యతిరేకంగా కులం పేరుతో జరుగుతున్న సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడుతూ అణగారిన వర్గాల హక్కుల కోసం, అణగారిన వర్గాల సమానత్వం కోసం అంబేడ్కర్ పాటుపడ్డారన్నారు. కులం పేరిట ప్రజలను వివక్షకు గురి చేయరాదన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు ప్రతిజ్ఞలో పాల్గొన్నారు. జిల్లా రెవిన్యూ అధికారి ఎ.సాధనకురళ్, హోసూరు కార్పొరేషన్ కమిషనర్ టి.స్నేహా, తాడ్కో మేనేజర్ వేల్‌మురుగన్, డిప్యూటీ డైరెక్టర్ ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ లెఫ్టినెంట్ కలాల్(రిటైర్డ్) ఆర్.పి.వేలు, జిల్లా కలెక్టర్ కార్యాలయం నిర్వాహకులు కృష్ణమూర్తి, ముత్తుసెళియన్, జిల్లా కలెక్టర్ మృణాలిని తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌తో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

విద్యతోనే సమాజ ఉన్నతి

హోసూరు, ఏప్రిల్ 12: సమాజ ఉన్నతికి విద్యయే కారణమని వక్తలు పేర్కొన్నారు. గుజరాత్‌కు చెందిన సుమన్ నిర్మల్ మిండా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హోసూరు సమీపాన 7.5 ఎకరాలలో అత్యాధునిక సౌకర్యాలు మౌలిక సదుపాయాలను కలిగిన పాఠశాలను ఎమ్మెల్యే వై ప్రకాశ్ లాంఛనంగా ప్రారంభించారు. ఇక్కడ నర్సరీ నుండి నాల్గో తరగతి వరకు ఉన్నాయి. భవిష్యత్తులో విద్యార్థులను 1500కు పెంచనున్నారు. యునో మిండా గ్రూప్ సీఎండీ నిర్మల్ మిండా మాట్లాడుతూ చక్కటి సమాజానికి పునాది విద్యయేనన్నారు. సుమన్ నిర్మల్ మిండా ఫౌండేషన్ అధ్యక్షురాలు సుమన్ నిర్మల్ మిండా మాట్లాడుతూ తాము విద్యావేత్తలతో రాణించడమే కాకుండా సామాజిక విలువలను ప్రోత్సాహించే లక్ష్యం కలిగినట్టు తెలిపారు.

విద్యుదాఘాతంతో నాలుగు పెలికాన్ పక్షుల మృతి

బళ్లారి సిటీ, ఏప్రిల్ 12: హగరి బొమ్మనహళ్ళి తాలూకా బాచిగొండనహళ్ళి సమీపంలోని తుంగభద్ర బ్యాక్ వాటర్ గుండా వెళుతున్న థర్మల్ పవర్ ప్లాంట్ లైన్లతో విద్యుత్ షాక్ కారణంగా నాలుగు పెలికాన్ పక్షులు మృతిచెందాయి. ఆహారం వెతుక్కుంటూ తుంగభద్ర బ్యాక్ వాటర్స్‌కు వలస పక్షులు తండోపతండోలుగా వస్తుంటాయి. అయితే వస్తున్న హడావిడిలో హైటెన్షన్ లైన్‌కు తగిలి పక్షులు విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడుతున్నాయి. పక్షులకు ఇబ్బంది కలుగకుండా విద్యుత్ లైన్లకు శాస్త్రీయంగా లైట్ ప్యానెల్స్(రిఫ్లెక్టర్లు) ఏర్పాటు చేయాలి. దీంతో ప్రమాదాలను నివారించవచ్చు. నవంబర్ నుండి ఇప్పటి వరకు 20కి పైగా పక్షులు చనిపోయాయని పక్షిప్రేమికుడు మహేశ్వర్ హురుకడ్లి తెలిపారు.



మృతిచెందిన ఫెలికాన్ పక్షులు

కరువు పనుల కోసం ప్రతి తాలూకాకు రూ.50 లక్షలు

రాయచూరు, ఏప్రిల్ 12 : జిల్లాలో నెలకొన్న కరువు పనుల కోసం ప్రతి తాలూకాకు రూ.50లక్షలు విడుదల చేస్తున్నట్లు జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. ముఖ్యంగా తాగునీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం తనను కలిసిన విలేకరులతో మాట్లాడిన జిల్లాధికారి జిల్లాలో తాగునీటి సమస్యను నివారించేందుకు నారాయణపూర్ జలాశయం నుంచి ఇప్పటికే 0.5 టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేశారని రెండు రోజుల్లోనే జిల్లాలోని గూగల్ జలాశయానికి ఆ నీరు చేరే అవకాశం ఉందన్నారు. అనంతరం తిరిగి జూన్ మొదటి వారంలో మరో 0.5 టీఎంసీల నీటి విడుదలకు ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. కాగా తాగునీటి సమస్య తలెత్తకుండా సహాయ కమిషనర్ అధ్యక్షతన ప్రతి తాలూకాకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసి ప్రతి శనివారం సమస్య పై సమీక్ష నిర్వహించి సోమవారం నివేదిక ఇచ్చేలా ఏర్పాటు చేశామని జిల్లాధికారి వివరించారు. జిల్లాలోని ఆర్టీపీఎస్, వైటీపీఎస్ థర్మల్ విద్యుత్ కేంద్రాలకు 3 టీఎంసీల నీటిని ప్రత్యేకించామని అదే సమయంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి పొరపాట్లు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. లోకసభ ఎన్నికల నేపథ్యంలో అన్ని చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా ఉన్నట్లు తెలిపారు. కాగా చెక్‌పోస్టుల వద్ద నగదు రవాణాకు సంబంధించి 14 కేసులు నమోదు కాగా తొమ్మిది కేసులను పరిష్కరించామన్నారు.



మాట్లాడుతున్న డీసీ చంద్రశేఖర్ నాయక్

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

రాఘవరావు (రేడియో అన్నయ్య) (జయంతి)



'రేడియో అన్నయ్య'గా పేరొందిన న్యాయపతి రాఘవరావు 1905 ఏప్రిల్ 13న ఒడిశా రాష్ట్రం బెర్హంపూర్‌లో జన్మించారు. బాల సాహిత్యవేత్త. బాలబాలికల శ్రేయస్సు, సాంస్కృతిక వికాసానికి తన జీవితాన్ని అంకితం చేసిన విద్యావేత్త, కళాకోవిదుడు, రచయిత. ఆలిండియో రేడియోలో తెలుగులో చిన్నారులకోసం నిర్వహించిన కార్యక్రమాలు ఎంతో పేరొందాయి. ఆయన సతీమణి కామేశ్వరి 'రేడియో అక్కయ్య'గా రాణించారు. 'బాల' అనే పిల్లల సాహిత్య పుస్తకాన్ని రెండు దశాబ్దాలపాటు విజయవంతంగా నిర్వహించి ఇతర పత్రికలకు స్ఫూర్తిగా నిలిచారు. ఆయన స్థాపించిన ఆంధ్ర బాలానందసంఘం నేటికీ కొనసాగుతోంది. పూర్తిగా చిన్నారులతో 'బాలానందం' సినిమాను నిర్మించారు. 1984 ఫిబ్రవరి 24న కన్నుమూశారు.

ధూళిపాళ సీతారామశాస్త్రి (వర్ధంతి)



ధూళిపాళ సీతారామశాస్త్రి 1922 సెప్టెంబరు 24న గుంటూరు జిల్లా పల్నాడు తాలూకా దాచేపల్లి గ్రామంలో జన్మించారు. తెలుగు నాటక రంగంలోనూ, సినీ రంగంలోనూ తన నటనా ప్రతిభతో విశేషంగా రాణించిన నటుడు. ఆయన పేరు చెప్పగానే శ్రీకృష్ణ పాండవీయంలో 'శకుని' పాత్ర కళ్లముందు మెదులుతుంది. అంతగా ఆ పాత్రకు జీవం పోశారు. ప్రత్యేక తరహా వాచకం, హావభావాలతో సీఎస్ఆర్, లింగమూర్తి అంత పేరొందారు. పౌరాణిక, సాంఘికాలతోపాటు 300కుపైగా సినిమాలలో నటించారు. 2001లో కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి ద్వారా సన్యాసదీక్ష స్వీకరించి జీవిత చరమాంకంలో శ్రీరామ సేవకే అంకితం చేశారు. 2007 ఏప్రిల్ 13న కన్నుమూశారు.

ప్రకృతి వ్యవసాయం.. లాభదాయకం

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 12: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటల సాగు లాభదాయకమని కేంద్ర బృందం సభ్యుడు, రూరల్ డెవలప్‌మెంట్ కార్యాలయ ఆర్డీ శైలేంద్రకుమార్ సింగ్ పేర్కొన్నారు. పరిగి మండలంలోని గొరవనహళ్ళిలో శుక్రవారం వారు పర్యటించారు. అక్కడ రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండిస్తున్న పంటలు, వాటి దిగుబడి, లాభాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఘనామృతం, జీవామృతం, బెల్లం, శనగపిండి మిశ్రమం తయారీపై ఆరాతీశారు. వీటిపై దేశవిదేశాల ప్రతినిధులతో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరిస్తామని వ్యవసాయ శాఖాధికారులు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ పంట దిగుబడి రావడమే కాకుండా ఆరోగ్యకరమైన పంటలు అందుతాయన్నారు. భూమి పైపొరల వద్దకు వానపాములు వస్తాయనీ, దీంతో భూమి సారవంతమౌతుందన్నారు. గొరవనహళ్లిలో రైతులు పండించిన రాగి, మొక్కజొన్న, జొన్న తదితర పంటలను పరిశీలించారు. వారు అనుసరిస్తున్న పద్ధతులు లాభదాయకంగా ఉన్నాయా, లేదా తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి విజయ్‌కుమార్, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

మీటర్ల ఏర్పాటుపై రైతుల ఆగ్రహం

ఉరవకొండ, ఏప్రిల్12: వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వజ్రకరూరు మండలంలోని చాయాపురం గ్రామంలో శుక్రవారం వ్యవసాయ మోటార్లకు మీటర్లను ఏర్పాటు చేస్తున్న సిబ్బందిపై పొలాల్లోనే రైతులు తిరగబడ్డారు. తమ అనుమతులు లేకుండా, కనీసం ముందస్తు సమాచారం ఇవ్వకుండా మీటర్లను ఎలా బిగిస్తారంటూ సిబ్బందిని నిలదీశారు. అప్పటికే బిగించిన మోటార్లను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నిబంధనల పేరుతో రైతులను ఇబ్బంది పెడితే ఓటుతో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పి, మీటర్లు ఎందుకు బిగిస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు తమ్మినేని నాగభూషణం, సర్పంచ్ మనోహర్ మాట్లాడుతూ వ్యవసాయ మోటార్లకు మీటర్లను ఏర్పాటు దుర్మార్గమైన చర్య అన్నారు. మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు.

మీటర్లను ధ్వంసం చేస్తాం : ఏపీ రైతు సంఘం

వ్యవసాయ మోటార్లకు మీటర్లను బిగిస్తే వాటిని ధ్వంసం చేస్తామని ఏపీ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి మనోహర్ హెచ్చరించారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లను బిగించడం ప్రభుత్వ అనాలోచిత నిర్ణయమన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మధుసూదన్ మాట్లాడుతూ వ్యవసాయ మోటార్లకు మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల రైతులు నట్టేట మునిగారన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక మిర్చి రైతులు పొలాల్లోనే రాశులు పోసుకుని అమ్ముకునేందుకు ఎదురు చూస్తున్నారన్నారు.

బి-ఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 12: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీఫార్మసీ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు శుక్రవారం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ కేశవరెడ్డి, సీఈ చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ఫిబ్రవరి, మార్చిలో బీఫార్మసీ ప్రథమ సంవత్సరం ఒకటవ సెమిస్టర్ (ఆర్19) రెగ్యులర్, సప్లమెంటరీ పరీక్షలు నిర్వహిండం జరిగిందన్నారు. అదేవిధంగా ద్వితీయ సంవత్సరం ప్రథమ సెమిస్టర్(ఆర్15), ద్వితీయ సెమిస్టర్(ఆర్19,15) సప్లమెంటరీ పరీక్షలు జరిగాయన్నారు. ఫార్మా-డీ ఐదవ సంవత్సరం(ఆర్17) రెగ్యులర్, సప్లమెంటరీతోపాటు ఫార్మా-డీ(పీ.బీ) తృతీయ సంవత్సరం(ఆర్17) రెగ్యులర్ పరీక్షలు నిర్వహించామన్నారు. విద్యార్థులు వారి ఫలితాలకోసం www.jntua.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

కానిస్టేబుల్‌పై వేటు..?

చిలమత్తూరు, ఏప్రిల్ 12: మద్యం తరలిస్తున్న ఓ కానిస్టేబుల్‌పై వేటు పడింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. శెట్టిపల్లి పంచాయతీ పరిధిలో ఎస్.ఐ హసేన్‌పురానికి వెళ్లి తిరిగి వస్తుండగా అర్ధరాత్రి సమయంలో వీరాపురం వైపు నుంచి కారు ఎదురుగా వచ్చింది. పోలీస్ సైరన్ మోగించడంతో ఆ కారులో ఉన్న వ్యక్తులు తప్పించుకోవడానికి ప్రయత్నించారు. వారిలో కానిస్టేబుల్ కూడా ఉన్నట్లు ఎస్ఐ గుర్తించారు. ఆ కారు వెంట అనుసరిస్తున్న మరో ద్విచక్రవాహనం అదీ కానిస్టేబుల్‌ది కావడం, ద్విచక్రవాహనంలో మండల ప్రజాప్రతినిధి బంధువు ఉన్నాడు. ఇతను పలు దఫాలుగా మద్యం కేసుల్లో పట్టుబడినట్లు తెలిసింది. ఆ కారులో ఉన్నది మద్యమేనని ఎస్ఐ గుర్తించారు. ఆ కానిస్టేబుల్ విధులకు హాజరుకాక పోవడంతో అనుమానం వచ్చి విచారించారు. అసలు విషయం బయట పడినట్లు తెలిసింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో విషయం బయటికి పొక్కకుండా వీఆర్‌కి పంపారు.

ఉన్నతవిద్యపై పెరుగుతున్న ఆసక్తి

▶▶ అనుగుణంగా కళాశాలల పెంపు అవసరం

బెంగళూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్నత విద్యపై ఆసక్తి పెరుగుతోంది. ఏటా పదో తరగతి నుంచి పీయూకు ఆ తర్వాత డిగ్రీకి చేరే విద్యార్థుల సంఖ్య గణనీయంగా అధికమవుతోంది. అందుకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల పెంపు అనివార్యమవుతోంది. ద్వితీయ పీయూ పరీక్ష ఫలితాలు బుధవారం వెల్లడయ్యాయి. 81.15 శాతం ఉత్తీర్ణత సాధ్యమైంది. దీన్నిబట్టి 5.52 లక్షలమంది విద్యార్థులు పీయూ పూర్తి చేశారు. ఇంతమందికి అవసరమైన డిగ్రీ, ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలలు, పాలిటెక్నిక్‌లు అందుబాటులో ఉన్నాయా..? అనేది చర్చనీయాంశమైంది. రాష్ట్రంలో 430 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, 370 ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. సాంకేతిక విద్యలో 16 ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలు 102 ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు, 44 ఎయిడెడ్, 196 ప్రైవేట్ పాలిటెక్నిక్‌లు ఉన్నాయి. బెళగావి కేంద్రంగా ఉండే విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ యూనివర్సిటీ (వీటీయూ)కు అనుబంధంగా 208 ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి. రాష్ట్రంలో 41 ప్రభుత్వ యూనివర్సిటీలు, 27 ప్రైవేట్ యూనివర్సిటీలు, 11 డీమ్డ్ యూనివర్సిటీలు ఉన్నాయి. జాతీయ విద్యావిధానం వచ్చాక యనివర్సిటీలలోనూ డిగ్రీ కోర్సులు ఆరంభించారు. అంతకుముందు యూనివర్సిటీలలో పీజీ కోర్సులు మాత్రమే కొనసాగేవి. ద్వితీయ పీయూసీలో 5.52 లక్షలమంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా ఆర్ట్స్‌లో 1.28 లక్షలమంది, కామర్స్‌లో 1.74 లక్షలమంది, సైన్స్‌లో 2.49 లక్షలమంది ఉత్తీర్ణత సాధించారు. సైన్స్ కోర్సుల పట్ల విద్యార్థులలో ఉత్సాహం పెరిగినట్లు ఫలితాలు రుజువు చేశాయి. ఈసారి వృత్తివిద్యా కోర్సులలో ప్రవేశానికి సీఈటీ పరీక్షల్లో పాల్గొనేందుకు 3.75 లక్షలమంది నమోదు చేసుకున్నారు. 2021 కొవిడ్ వేళ రాష్ట్రంలో ద్వితీయ పీయూ పరీక్షలు జరపకుండానే ఉత్తీర్ణత ప్రకటించారు. వందశాతంగా 6.6లక్షల మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఉన్నత విద్యాశాఖ విశ్వవిద్యాలయాలకు ప్రత్యేకంగా సీట్లు పెంచుకోవాలని సూచించింది. సరిగ్గా మూడేళ్ల తర్వాత మరోసారి అదే పరిస్థితి నెలకొంది.

మౌలిక సదుపాయాల మెరుగు ఆవశ్యకత

2021 విద్యాసంవత్సరం కొవిడ్ కాలంలో 4.70 లక్షలమంది కాగా, 2022లో 3.46 లక్షలమంది కాగా, 2023లో 3.28 లక్షలమంది డిగ్రీలో చేరారు. ద్వితీయ పరీక్షా ఫలితాలు రికార్డుస్థాయిలు నమోదు కావడం ఆశాజనకం. అయితే అందుకు తగ్గట్టుగా ఉన్నత విద్య డిగ్రీలో చదివేందుకు అవసరమైన కళాశాలలు, సీట్ల పెంపు విషయమై విద్యాశాఖ చొరవ చూపాల్సి ఉంది. అవసరమైన మేరకు ఎక్కువసీట్లు ప్రతి విద్యాసంస్థలో పెంచేలా మార్గదర్శకాలు ఇవ్వాలి. అందుకు అనుగుణంగా అధ్యాపకులు, తదితర సౌలభ్యాలు కూడా ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రాథమిక పాఠశాలల్లోనే మౌలిక సదుపాయాలు లేవనే విమర్శలు ఉన్నాయి. ఉన్నత విద్యాశాఖతోపాటు యూనివర్సిటీలు తగిన చొరవ చూపాల్సిన అవసరం ఉంది.

మళ్లీ తెరపైకి ఫోన్ ట్యాపింగ్

▶▶ జేడీఎస్, కాంగ్రెస్ నేతల వాగ్యుద్ధం

బెంగళూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ అంశం మరోసారి వాగ్వాదాలకు కారణమవుతోంది. 2019లో రాష్ట్ర రాజకీయాల్లో పెనుదుమారం రేపింది. ఆదిచుంచనగిరి మఠాధిపతి నిర్మలానందనాథస్వామిజీ ఫోన్ ట్యాప్ అంశం అప్పట్లో చర్చనీయాంశమైంది. ఫోన్ ట్యాపింగ్ చేయించింది కుమారస్వామి అంటూ కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. ఒకవేళ ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడి ఉంటే నా ప్రభుత్వం ఎందుకు కూలేదని కుమారస్వామి ప్రశ్నించారు. ఆదిచుంచనగిరి మఠాధిపతి ఫోన్‌ట్యాపింగ్ జరిపించింది కుమారస్వామి అంటూ మంత్రి చలువరాయస్వామి ఆరోపించారు. డీసీఎం డీకే శివకుమార్ మరింత బలాన్ని చేకూర్చేలా ఫోన్‌ట్యాపింగ్‌కు సంబంధించిన ఆధారాలు ఉన్నాయని, సరైన సమయంలో విడుదల చేస్తామన్నారు. వీటన్నింటికీ మూలం బీజేపీ-జేడీఎస్ అభ్యర్థులు రెండు రోజులక్రితం ఆదిచుంచనగిరి మఠాధిపతి నిర్మలానందస్వామిజీని భేటీ కావడంతోనే తెరపైకి వచ్చింది. ఒక్కలిగ సీఎం కుమారస్వామి ప్రభుత్వాన్ని బీజేపీవారు కూల్చారని, ప్రస్తుతం స్వామిజీ చెంతకు వెళ్లి ఆశీస్సులు పొందుతున్నారని ఈ విషయాన్ని స్వామిజీ ప్రశ్నించగలరా..? అంటూ డీకే శివకుమార్ చేసిన వ్యాఖ్యలతోనే వివాదం రాజుకుంది. కుమారస్వామి దీటుగా స్పందించి ఫోన్‌ట్యాపింగ్‌పై ఎటువంటి దర్యాప్తుకైనా జరుపుకోవచ్చునని, అనవసరపు అంశాలను దారి తప్పించే ఆరోపణలు చేయరాదని మండిపడ్డారు.

నిర్భయంగా ఓటు వేయండి

చింతామణి, ఏప్రిల్ 12: ప్రజలు ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా నిర్భయంగా ఓటు వేయాలని తాలూకా పంచాయతీ ఈఓ, స్వీప్ సమితి అధ్యక్షుడు ఆనంద్ పేర్కొన్నారు. తాలూకాలోని మురగమల్లెలో శుక్రవారం ఓటు హక్కుపై జాగృతి జాథా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రజాప్రభుత్వ పండుగలో అందరూ భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. ఓటు వేయడం ప్రజలబాధ్యత అన్నారు. ఇటీవలికాలంలో ఓటు వేసేందుకు యువత నిరాసక్తి చూపడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కారణాలు ఏమైనా యువత సహా ప్రజలందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. చింతామణి ఉపవిభాగం డీఎస్పీ మురళీధర్ మాట్లాడుతూ విద్యావంతులు సైతం ఇటీవలికాలంలో ఓటుపై నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు. 18ఏళ్లు నిండినవారంతా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. డప్పు, వివిధ జానపద కళాబృందాల ద్వారా ఓటు ఆవశ్యకతను తెలిపే కార్యక్రమం నిర్వహించి ర్యాలీగా ఊరేగారు. ఈ సందర్భంగా బీఈఓ ఉమాదేవి, నరేగా సహాయక డైరెక్టర్ కవితా, మురగమల్లా గ్రామ పంచాయతీ పీడీఓ సురేశ్, బిల్ కలెక్టర్ మంజునాథ్ సహా ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



మురగమల్లలో ఓటుహక్కుపై జాగృతిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజలు

గ్రామస్థులతో ఎన్నికల అధికారుల చర్చలు విఫలం



మజరాహోసహళ్లిలో తహసీల్దారు తదితరులు

దొడ్డబళ్ళాపుర, ఏప్రిల్ 12: శుద్ధతాగునీటి డిమాండ్‌తో 18 గ్రామాల ప్రజలు లోక్‌సభ ఎన్నికలను బహిష్కరిస్తూ పిలుపునిచ్చిన నేపథ్యంలో అధికారులు స్పందించారు. ఈమేరకు ఎన్నికల అధికారులు గ్రామస్తులతో జరిపిన చర్చలు విఫలమయ్యాయి. బాశెట్టిహళ్ళి పారిశ్రామికవాడ, దొడ్డబళ్ళాపుర నగరసభ వ్యర్థపునీటి వల్ల చిక్కతుమకూరు, దొడ్డతుమకూరు చెరువులు కలుషితం అవుతున్నాయన్నారు. మజరాహోసహళ్ళి, దొడ్డతుమకూరు గ్రామ పంచాయతీలలోని 18 గ్రామాలలో భూగర్భజలాలు కలుషితం అవుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. దొడ్డబళ్ళాపుర తహసీల్దారు విభావిద్యారాథోడ్, దొడ్డబళ్ళాపుర నగరసభ కమిషనర్ పరమేశ్ నేతృత్వంలో గ్రామస్తులతో జరిపిన చర్చలు ఫలించలేదు. ప్రధానంగా మురుగునీటి శుద్ధీకరణ కోసం మూడోదశ ఎస్‌టీపీ ఏర్పాటు చేయాలని, ఇంటింటికీ వర్షపునీటి సేకరణ విధానానికి ప్రభుత్వంనుంచి సహాయధనం సమకూర్చాలన్న డిమాండ్‌కు సానుకూలత వ్యక్తం కాలేదు. 18 గ్రామాలకు జక్కలమడగు డ్యామ్ నుంచి నీటిని సరఫరా చేస్తామని, పశుపక్ష్యాదులకోసం తొట్టెలు ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఇతర డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సందర్భంగా బీహెచ్ కెంపణ్ణ, ఆదిత్యనాగేశ్, టీ రంగరాజు, సందేశ్, రైతు నాయకులు వసంత్‌కుమార్, సతీశ్ తదితరులు వివిధ గ్రామాలవారు పాల్గొన్నారు.

హిందీతో పలు భాషలు సరళీకృతం

బెంగళూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): హిందీభాష నేర్చుకోవడం ద్వారా పలు భాషలు సరళీకృతమవుతాయని ఏదైనా భాష నేర్చుకోవడం ద్వారా మన ఆలోచనలు విస్తృతం అవుతాయని క్రైస్ట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సెబాస్టియన్ అభిప్రాయపడ్డారు. కెనరాబ్యాంకుకు ప్రధాన కార్యాలయంలో అంతర కళాశాలల హిందీ సెమినార్, భాషా అంశాలపై చర్చాగోష్ఠి జరిగింది. కెనరాబ్యాంకు ఏజీఎం రమేశ్‌తోపాటు ప్రభుత్వ కార్యాలయాల అధికారులు, పారిశ్రామిక వేత్తలు హాజరయ్యారు. కెనరాబ్యాంకు సీనియర్ మేనేజర్ మాయాంక్ పాఠక్ చర్చాగోష్ఠిని ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రైస్ట్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ భన్వర్‌సింగ్ షెకావత్ 'హిందీలో ఉన్నత విద్య - ఉద్యోగ అవకాశాలు' అనే అంశంపై మాట్లాడారు. వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, హిందీ అధ్యాపకులు భాగస్వామ్యులయ్యారు. కెనరాబ్యాంకు సీనియర్ మేనేజర్ అశోక్‌కుమార్ ముఖ్యులుగా పాల్గొన్నారు.



చర్చాగోష్ఠిలో పాల్గొన్న ప్రముఖులు

నిరంతర అధ్యయనంతోనే అవగాహన



పుస్తకావిష్కరణలో నిర్మలానందనాథస్వామిజీ తదితరులు

బెంగళూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికత పట్ల నిరంతర అధ్యయనం చేస్తేనే సమగ్ర అవగాహన సాధ్యమవుతుందని ఆదిచుంచనగిరి మఠాధిపతి అభిప్రాయపడ్డారు. ఇన్ క్వెస్ట్ ఆఫ్ గురు అనే పుస్తకాన్ని లాంఛనంగా ఆవిష్కరించారు. మిథిక్ సొసైటీలో థింకర్స్ ఫోరం కర్ణాటక ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కొన్నేళ్లక్రితం భారత్‌కు వచ్చిన అమెరికా సినిమాటోగ్రాఫర్ ఆనంద్ మాథ్యూస్ రచించిన వ్యక్తిగత, ఆధ్యాత్మిక పరివర్తన నమ్మకానికి దారి దీపం ఇచ్చిందని అభిప్రాయపడ్డారు. ఇన్ క్వెస్ట్ ఆఫ్ గురులో కొన్ని కీలకఅంశాలు ఆశాజనకమన్నారు. అమెరికాకు చెందిన రచయిత భారత్‌లోని సనాతన ధర్మాన్ని అర్థం చేసుకుని ఇన్ క్రైస్ట్ ఆఫ్ గురు పుస్తకరూపంలోకి తెచ్చారన్నారు. గురువుకు అన్వేషణ అనే కోణంలో సాగిందన్నారు. సనాతనధర్మం ప్రయోగాత్మకంగా అన్వయిస్తుందని, జీవనం కోసం ప్రాచీన, వైదిక తత్వాలకు సమకాలీనమన్నారు. నేటి యువకులు ఆధ్యాత్మికతపై కొంత మేరనైనా అవగాహన కల్పించుకోవాలన్నారు. ఎస్ వ్యాస యూనివర్సిటీ ముఖ్యులు పద్మశ్రీ డాక్టర్ హెచ్ఆర్ నాగేంద్ర, మేజర్ జనరల్ డాక్టర్ జీడీ బక్షి, న్యాయమూర్తి కృష్ణభట్, లెఫ్టినెంట్ జనరల్ నటరాజన్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

ఘనంగా వీరాంజనేయస్వామి రథోత్సవం

చింతామణి, ఏప్రిల్ 12: పట్టణంలోని బెంగళూరు రోడ్డు 8వ వార్డు కన్నంపల్లి వీరాంజనేయస్వామి, పంచముఖి ఆంజనేయస్వామి సన్నిధిలో వీరాంజనేయస్వామి సమేత సీతారామ కల్యాణ బ్రహ్మరథోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. పంచముఖి ఆంజనేయస్వామికి వీరాంజనేయస్వామి, వీరాంజనేయస్వామికి బలిహరణ, రథ ప్రతిష్ఠ హోమం, పుష్పాలంకరణ సేవ, మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కన్నంపల్లి గ్రామస్తులచే ప్రత్యేక దీపోత్సవం జరిగింది. ప్రభుత్వం తరపున జరిగే రథోత్సవంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది, దేవదాయశాఖ సిబంది పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, మాజీ మంత్రి చౌడరెడ్డి కుటుంబం ఆధ్వర్యంలో హోమాదికాలు, పూర్ణాహుతి అనంతరం రథోత్సవానికి శ్రీకారం చుట్టారు. దేవాలయ ప్రముఖులు మీసె వెంకటరెడ్డి, నగరసభ సభ్యుడు రెడ్డెప్ప, నగరసభ మాజీ సభ్యురాలు అరుణా మంజునాథ్, మాళపల్లి ఎంఎన్ మునిశామిరెడ్డి, బీరంగిబాబు, మాళపల్లి కృష్ణారెడ్డి, శ్రీనివాస్, కన్నంపల్లికి చెందిన అరుణారెడ్డి, గోవిందరెడ్డి, మంజునాథ్, గోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కంచి వెంకటాచలపతి ఆధ్వర్యంలో అన్నసంతర్పణ, కన్నంపల్లి, మాళపల్లి గ్రామస్తులు, కొమర్ల కేవీ నాగరాజయ్య కుటుంబీకులచే అన్నసంతర్పణ జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కాగా రథోత్సవం సాగే ప్రాంతంలో చల్లదనం కోసం రహదారిపై నీరు చల్లారు. పలు రకాల తినుబండారాల దుకాణాలు ఏర్పాటు చేయగా జాతర వాతావరణం నెలకొంది.



రథోత్సవంలో భక్తుల సందడి

కొత్తకోటెలో భక్తిశ్రద్ధలతో గ్రామజాతర

బాగేపల్లి, ఏప్రిల్ 12: తాలూకాలోని కొత్తకోటె గ్రామపంచాయతీ పరిధిలోని మాడపల్లిలో శుక్రవారం గ్రామజాతర భక్తిశ్రద్ధలతో జరిగింది. గ్రామదేవతలు చౌడేశ్వరి, గంగమ్మ, సప్పలమ్మ, సత్యమ్మ, ఈర్లప్ప సహా పలు దేవతల ఉత్సవమూర్తులను పల్లకీలో ఊరేగించారు. గ్రామస్తులు హారతి ఇచ్చిన అనంతరం సంప్రదాయ పూజలతో మొక్కులు తీర్చుకున్నారు. ఉగాది అనంతరం నిర్వహించే గ్రామదేవతల జాతరకు చుట్టుపక్కల ప్రాంతాలనుంచి భక్తులు పెద్దసంఖ్యలు తరలివచ్చారు. ప్రత్యేకించి గ్రామదేవత చౌడేశ్వరి దేవిని గ్రామమంతా విశేషంగా ఊరేగించారు.



గ్రామంలో చౌడేశ్వరి దేవి ఊరేగింపు

ఎన్నికలకు రూ.50 లక్షలు డిమాండ్

▶▶ మంత్రి శివానంద పాటిల్‌పై యత్నాళ్ ఆరోపణ

బెంగళూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బాగల్కోటె కాంగ్రెస్ అభ్యర్థి సంయుక్తా పాటిల్ ఎన్నికల కోసం మంత్రి శివానంద పాటిల్ రూ.50లక్షలు డిమాండ్ చేశారని బీజేపీ సీనియర్ ఎమ్మెల్యే బసనగౌడపాటిల్ యత్నాళ్ సంచలన ఆరోపణ చేశారు. విజయపురలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కుమార్తె ఎన్నికల కోసం మంత్రి షుగర్ ఫ్యాక్టరీల యజమానులకు ఏకంగా అరకోటి డిమాండ్ పెట్టారన్నారు. చక్కెరశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నందున ఫ్యాక్టరీ యజమానులు ఎటూ నిర్ణయించుకోలేకపోతున్నారని ఆరోపించారు. అన్నదాతలు పరిహారం కోసం ఆత్మహత్యలు చేస్తారని ఆరోపించిన మంత్రి ఇప్పుడు కుమార్తె ఎన్నికలకోసం రూ.50లక్షలకు టెండర్ పెట్టారని ఎద్దేవా చేశారు. ఇది కాంగ్రెస్ పాలనా తీరు అని మండిపడ్డారు.

జేడీఎస్‌కు షాక్ ఇచ్చిన శివకుమార్

బెంగళూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల వేళ ఎత్తుకు పైఎత్తులు సాగుతున్నాయి. జేడీఎస్‌కు చెందిన 400మంది నాయకులు, కార్యకర్తలను రాత్రికి రాత్రే కాంగ్రెస్‌లోకి చేర్చుకున్నారు. చెన్నపట్టణకు చెందిన జేడీఎస్ నాయకుడు అక్కూరుదొడ్డి శివణ్ణతో పాటు ఆయన అనుచరులు, అభిమానులు కార్యకర్తలను బెంగళూరు కాంగ్రెస్ కార్యాలయంలో డీకే శివకుమార్ కండువాలు కప్పి స్వాగతించారు. మైసూరులో కాంగ్రెస్ ముఖ్యనాయకుడు గురుపాదప్పను బీజేపీలో చేర్చుకున్న కొన్ని గంటల వ్యవధిలోనే బీజేపీ, జేడీఎస్‌లకు చెక్ పెట్టేలా డీకే శివకుమార్ వ్యవహరించారు. కాగా రామనగర జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడికి కండువా కప్పి స్వాగతించారని జేడీఎస్ నాయకులు ఎద్దేవా చేశారు.

ఫ్లై ఓవర్ నుంచి దూకి యువకుడి ఆత్మహత్య

బెంగళూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నాయండ హళ్ళి ఫ్లై ఓవర్ నుంచి దూకి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం నవీన్‌కుమార్ (30) ఫ్లై ఓవర్‌పై ద్విచక్రవాహనాన్ని ఆపి ఒక్కసారిగా కిందకు దూకాడు. పడిన వెంటనే తీవ్రమైన గాయాలపాలై మృతి చెందాడు. మూడు నెలలనుంచి ఎలక్ట్రిసిటీ విభాగంలో కంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఇంట్లో పనికి వెళ్తున్నానని చెప్పి వచ్చిన నవీన్ ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడనేది తెలియరాలేదు. రెండు నెలలక్రితమే ఇతడికి వివాహం జరిగింది. బ్యాటరాయనపుర పోలీసులు సంఘటనా స్థలాన్ని చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా కరగ ఉత్సవం

శిడ్లఘట్ట, ఏప్రిల్ 12: పట్టణంలోని కేకే పేటలో కొలు వైన పురాతన కాలంనాటి రేణుకా ఎల్లమ్మదేవి కరగ ఉత్సవం ఘనంగా జరి గింది. 9న హసి కరగ నిర్వహిం చగా గురువారం రాత్రి ప్రారంభమైన కరగ ఊరేగింపు శుక్రవారం సాయంత్రం వరకు సాగింది. ఉత్సవంలో భాగంగా అన్ని వీధులను స్వచ్ఛ పరిచారు. కరగధారి గోవింద గోవింద అంటూ నృత్యం చేస్తూ ఊరేగారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు రాజీవ్‌గౌడ ఆలయానికి వచ్చి విశేషపూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలు పాటించడం వల్ల మానసిక ప్రశాంతత సాధ్యమన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు నటరాజ్, తోపుడ నాగరాజ్, ఫుడ్ మనోహర్, ఆలయ కమిటీ వేదమూర్తి తదితరులు పాల్గొన్నారు. మూడు రోజులపాటు సాగిన కరగ ఉత్సవంలో భక్తుల సందడి నెలకొంది. జాతర ప్రాంతాలలో విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. సంప్రదాయాలను కాపాడుకోవడమే కరగ ఉత్సవ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.



కరగధారి ఊరేగింపు

రాజధానిలో సంప్రదాయ రుచులు

బెంగళూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్, గుజరాతీ సంప్రదాయ రుచులు రాజధానిలో మరిన్ని ఆకట్టుకునే వంటకాలు చేరినట్టు నిర్వాహకులు ప్రకటించారు. 18ఏళ్లుగా ప్రత్యేక థాళి అనుభవం ఉందన్నారు. 30 రకాల రుచులు అందిస్తున్నామన్నారు. మ్యాంగోదాల్, మ్యాంగో మహారాజ దోక్లా, మ్యాంగో పూర్ణపోలితోపాటు ఇతర వంటకాలు ఉన్నాయన్నారు. గుజరాత్, రాజస్థాన్‌తోపాటు ఉత్తరభారతీయులు ఇష్టపడే వంటకాలు సిద్ధమన్నారు. మిరాహ్ హస్పి టాలిటీ, గోర్మెత్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో నగరవ్యాప్తంగా రాజధాని రెస్టారెంట్లు కొనసాగుతున్నాయన్నారు.